క్లుప్తంగా

ఇంటింటా సంక్షేమ వెలుగులు



ఎమ్మిగనూరులో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమౌతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 19 వార్డు పరిధిలో ఆ వార్డు కౌన్సిలర్ పూజేశ్వరి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ బంగిశ్రీరాం, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు ఇచ్చి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు నిండాయన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కౌన్సిలర్లు శివప్రసాద్, డిష్ శవరెడ్డి, నాయకులు సోమేష్, ప్రతాప్‌రెడ్డి, గోకారి, కోటకోండ నరసింహులు, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల శుభ్రత పాటించాలని వైద్యారోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాత కొబ్బరి చిప్పలు, టైర్లు, పాడైన డ్రమ్ములలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదని దీని ద్వారా దోమల లార్వా వృద్ధి చెందుతుందన్నారు. జర్వం, దగ్గు వంటి లక్షణాలుంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు.

నేడు, రేపు ఓటరు నమోదు శిబిరాలు

గోనెగండ్ల: అన్ని పోలింగ్ బూత్‌లలో డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 68 పోలింగ్ బూత్‌ల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలు ఓటర్ల జాబితా, వివిధ ఫారాలతో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ జాబితాలో తమ ఓటు ఉన్నది, లేనిది స్వయంగా పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే సంబంధిత బీఎల్‌ఓకి తగిన ఆధారాలతో దరఖాస్తును అందించవచ్చన్నారు. ముసాయిదా సవరణకు ఇదే ఆఖరి అవకాశమని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు కోసం ఫారం–6ను పూర్తి చేసి ఇవ్వాలన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై జిల్లా క్రీడా అథారిటీ కోచ్ మహేష్, రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమం విధివిధానాల గురించి గ్రామ సచివాలయ సిబ్బందికి వివరించారు. 15 ఏళ్లు నిండిన బాలబాలికలు క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ఈ నెల 13వ తేదీలోగా క్రీడాకారులు తమ గ్రామ సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కొండయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంఈఓ బాలనాయుడు, ఈఓపీఆర్డి బాలన్న తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి చూపాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి వెంకటలక్ష్మమ్మ

కృష్ణగిరి: జగనన్న కాలనీలతోపాటు వ్యక్తిగతంగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల నోడల్ అధికారి వెంకటలక్ష్మమ్మ హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె శుక్రవారం హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించేలా ప్రభుత్వం 45 రోజుల ప్రణాళిక చేపట్టిందన్నారు. మండలానికి 581 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 246 ఇళ్లు పూర్తయ్యాయని, వివిధ స్థాయిల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను జనవరి 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ రామస్వామి, హౌసింగ్ ఏఈ చంద్రరేఖ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: ఈ నెల 15వ తేదీలోపు జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ సీపీ కొండయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల్లో ప్రతి రోజూ పురోగతి ఉండాలన్నారు. ఇంటి నిర్మాణ దశను బట్టి బిల్లులు సత్వరమే మంజూరుచేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులను చైతన్యం చేసి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా కృషి చేయాలన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ బాలన్న, హౌసింగ్ ఏఇ భవ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి పరుగులు





కారుమంచిలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, సచివాలయ స్థల దాత జోగి రంగప్పను సన్మానిస్తున్న మంత్రి

ఆస్పరి: జగనన్న పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తించాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. శుక్రవారం కారుమంచి గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. మంత్రి జయరాం పాల్గొని గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆర్‌బీకే, గ్రామ సచివాలయం, రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. కారుమంచి గ్రామంలో వివిధ పథకాల ద్వారా రూ. 26.30 కోట్లను లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. గ్రామ సచివాలయం నిర్మాణానికి రూ.5 లక్షలు విలువ చేసే 5 సెంట్ల స్థలం ఇచ్చిన దాత జోగి రంగప్ప, ఉసేనమ్మ దంపతులను సత్కరించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నాయకులు దోచుకున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, వైస్ ఎంపీపీ చంద్రకళ, ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్‌డీ సూర్యనరసింహారెడ్డి, మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, బసవరాజు, సుంకర రామాంజనేయులు, రాజన్నగౌడ్, కౌలుట్లయ్య, తోయజాక్షప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



లబ్ధిదారులకు భూహక్కు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: తరతరాలుగా భూములను సాగుచేస్తూ ఎలాంటి హక్కులు లేని వారికి భూమిపై శాశ్వత హక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ భవనంలో లబ్ధిదారులకు అసైన్డ్ భూముల హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చారన్నారు. పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములకు శాశ్వత హక్కులు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు తెచ్చాడన్నారు. ప్రభుత్వం కల్పించిన హక్కుల ద్వారా అసైన్డ్ భూములు, ఇనామ్ భూములను కౌలుకు ఇచ్చుకోవచ్చని, అవసరమైతే విక్రయాలు చేసుకోవచ్చని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, తహసీల్దార్లు ఆంజనేయులు, నిత్యానందరాజు, వేణుగోపాల్, సర్పంచులు, ఎంపీటీసీలు, వీఆర్వోలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలతో సుపరిపాలన

నందవరం: గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సుపరి పాలన అందిస్తున్నాడని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తకైరవాడి గ్రామంలో సర్పంచ్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించడంతో పాటు రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ పాలన చేరువ చేయడమే లక్ష్యంగా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ దశరథ రామయ్య, సర్పంచ్ అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.12 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, నాయకులు చాంద్‌బాషా, వెంకటేష్, కృష్ణమూర్తి, పీఆర్ డీఈఈ చంద్రశేఖర్, ఏఈ జయన్న తదితరులు పాల్గొన్నారు.



కొత్త కైరవాడిలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

రాష్ట్రస్థాయి కబడ్డీ విజేత విజయనగరం



విజేత జట్టుకు కప్ అందిస్తున్న ఎర్రకోట జగన్

గోనెగండ్ల: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా కబడ్డీ పోటీల్లో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. నవంబర్ 29 నుంచి ఈనెల 1వ తేదీ వరకు గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేకల పెద్ద రంగస్వామి స్మారక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు రసవత్తరంగా సాగిన పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతగా నిలిచిన విజయనగరం జట్టుకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి కప్, ప్రశంసా పత్రాలు అందజేశారు. తర్వాతి స్థానాల్లో వరుసగా శ్రీకాకుళం, విశాఖపట్నం,, గుంటూరు జట్లు నిలిచాయి. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలు కుబేర్ నాయుడు, జాకీర్ హుసేన్, ఎస్‌బీ మన్సూర్, బందె నవాజ్, భాస్కర్ రెడ్డి, దొరబాబు, సీఐ మోహన్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు వీరే..

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన 16 మందిని సెలక్షన్ కమిటీ సభ్యులు గాయత్రి, సుబ్బరాజు, ముసలి నాయుడు జాతీయస్థాయికి ఎంపిక చేశారు. తిరుపతమ్మ, తన్వినాయుడు (కృష్ణా జిల్లా), గౌరి, రామలక్ష్మి (విశాఖపట్నం), రామలక్ష్మి, భువన (విజయనగరం), సంధ్య, హసీనా, శ్రీవాణి, హర్షిత (శ్రీకాకుళం), సోని (చిత్తూరు), వరలక్ష్మి, త్రివేణి (గుంటూరు), కవిత, రేవతి (కర్నూలు), నందిని (ప్రకాశం) ఎంపికయ్యారు. వీరు ఈనెల 10వ తేదీన పంజాబ్‌లో జరిగే జాతీయ క్రీడలలో రాష్ట్రం తరపున పాల్గొననున్నారు.

రేషన్ డీలర్ మృతి



మేఘనాథ రెడ్డి (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల కేంద్రంలోని 5వ నంబరు చౌక దుకాణం, 1వ వార్డుకు చెందిన రేషన్ డీలర్, గుడికల్ అల్లిపిర స్వామి సేవా సంఘం అధ్యక్షుడు మేఘనాథరెడ్డి (71) శుక్రవారం కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దీపావళి రోజున అనారోగ్యానికి గురైన మేఘనాథరెడ్డి కర్నూలు, హైదరాబాద్ ఆసుపత్రిలలో చికిత్స పొందాడు. ప్రస్తుతం కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఆయన మృతికి మాజీ ఎంపీపీ దశరథరామిరెడ్డి, పలువురు ప్రముఖులు, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు నివాళులర్పించారు. మృడికి భార్య, పెళ్లికాని కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఎమ్మిగనూరులో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని అధికారులు పిలుపునిచ్చారు. ఎమ్మిగనూరులో విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ ఆంజినేయులు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి విద్యార్థులచే అవగాహన ర్యాలీని ప్రారంభించారు. స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ సోమప్ప సర్కిల్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్‌ను నిర్మూలించాలని, వ్యాధిగ్రస్తుల పట్ల మానవత్వం చూపాలని సూచించారు స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, ఎంపీహెచ్ఈఓ విజయకృష్ణ, ఐసీటీసీ కౌన్సిలర్ రామాంజినేయులు, సీఈఓ ఓంకార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ కమిటీల ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరకాస్తు చేసుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వైష్ణవి డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 2, 3 తేదీల్లో ఓటరు నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎన్నికల డీటీ గురురాజారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.75 లక్షలతో సీసీ రోడ్లు

మద్దికెర: మద్దికెరలో 4 సచివాలయాల పరిధిలో రూ.75 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ శేషయ్య తెలిపారు. రోడ్లు వేసే కాలనీలను శుక్రవారం పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఏఈ మోహన్‌నాయక్, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, సచివాలయ కన్వీనర్ తాలూరి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు కృష్ణ, రామాంజులు ఉన్నారు.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన



శభాష్‌పురంలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. డీసీ కొండలో రూ.32 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, శభాష్‌పురంలో రూ.44.78 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, హెల్త్ సెంటర్‌ను శుక్రవారం సర్పంచ్ పుష్పావతి, ఎంపీటీసీ సభ్యురాలు రామాంజినమ్మతో కలిసి ప్రారంభించారు. సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరూ 'శభాష్' అనేలా శభాష్‌పురం పంచాయతీని అభివృద్ధి చేశామన్నారు. అన్ని వర్గాల వారికి అండగా నిలిచిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు విలువైన స్థలాలను ఇచ్చిన జయరాముడు, నరసింహయ్య, రాముడులను అభినందించారు. సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో పంచాయతీలో ఎక్కడా జానెడు సీసీ రోడ్డు కూడా వేయలేదని, ఇతర అభివృద్ధి పనులు జరగలేదని దీనిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అనంతరం ఎమ్మెల్యే వైఎస్సార్ జలకళ బోరు ప్రారంభించి 35 మంది రైతులకు ఉచిత మోటార్లు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన జయరామిరెడ్డిని పరామర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, రాఘవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, జగన్నాథ రెడ్డి, నారాయణనాయక్, రామచంద్రారెడ్డి, నాగభూషణరెడ్డి, గోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, హుసేన్, చాంద్‌బాషా, రఘు పాల్గొన్నారు.

మత్యకారుల అభ్యున్నతికి కృషి

కృష్ణగిరి: జలకళ సంతరించుకున్న చెరువుల్లో సొసైటీల ద్వారా చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకుని సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెనుమాడ చెరువులో శుక్రవారం ఆమె మత్స్యశాఖ డీడీ శ్యామలమ్మ, ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేతు సుభాషిణితో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని పెనుమాడ చెరువు, గాజులదిన్నె ప్రాజెక్టులో 4.5 లక్షల చేప పిల్లలు వదులుతున్నట్లు తెలిపారు. మత్స్య శాఖ డీడీ శ్యామలమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, సహకార సొసైటీ చైర్మన్ బ్రహ్మానంద రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరి, అంజినయ్య, మద్ది, అంజినప్ప, ఎఫ్‌డీఓ చంద్రయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పెనుమాడ చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, తదితరులు

రంగనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మద్దికెర: పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామిని శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ అర్చకులు సాదరంగా ఆహ్వానించి స్వామి జ్ఞాపిక, చీరను అందజేశారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

ఆలూరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఉమ్మడి జిల్లా హిందూ ధర్మ పరిషత్ తితిదే కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. ఎం.కొట్టాల గ్రామంలోని సుంకులమ్మ ఆలయంలో గ్రామ సర్పంచ్ రాజశేఖర్ సమక్షంలో మూడు రోజుల పాటు నిర్వహించిన హిందూ ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ధార్మిక, ఆధ్యాత్మిక ప్రవచనాలు, మహాభారతం, భగవద్గీత సూక్తులను వివరించారు. వృషభాలకు ప్రత్యేక పూజలు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తుల హల్‌చల్

ఆలూరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు హల్‌చల్ చేశారు. తెల్లవారుజామున 3 గంటలకు పది మంది కొత్త వ్యక్తులు తిరుగుతుండగా కాలనీవాసులు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చేలోపు వారు అక్కడినుంచి పరారయ్యారు. తర్వాత తిరిగివచ్చి కాలనీ వాసులపై గాజు సీసాలు, రాళ్లు రువ్వడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయమై ఆలూరు సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో రాత్రి గస్తీ ముమ్మరం చేశామన్నారు.

కుల వివక్షను నిర్మూలిద్దాం

హొళగుంద: అంటరానితనం, కుల వివక్షను శాశ్వతంగా నిర్మూలిద్దామని హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం రాత్రి సుళువాయి గ్రామంలో సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. అంటరానితనం, అస్పృశ్యత, వివక్షత, రెండు గ్లాసుల పద్ధతి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కులాల పట్టింపులకు పోకుండా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. సమస్య ఉంటే పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. దళితులు తమ పిల్లలను బాగా చదివిస్తేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు.

కుంకనూరులో ఫ్రైడే–డ్రైడే

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే–డ్రై డే కార్యక్రమాన్ని సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎంలు సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. రోడ్డుపై పారుతున్న మురుగునీటిని శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి తొట్టెలు, డ్రమ్ముల్లో ఎక్కువకాలం నీటిని నిల్వ ఉంచరాదన్నారు. దోమకాటుకు గురికాకుండా రాత్రి వేళల్లో దోమ తెరలను వాడాలని సూచించారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



కొక్కరచేడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



పందికోనలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నారాయణదాస్

తుగ్గలి: వైఎస్ జగనన్న పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం శభాష్‌పురంలో నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శభాష్‌పురం సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.22.80 కోట్లు అందించినట్లు వివరించారు. సర్పంచ్ పుష్పావతి, ఎంపీటీసీ రామాంజినమ్మ, నాయకులు హనుమంతు, రవి, నాగేష్, పులికొండనాయక్, వైస్ ఎంపీపీలు మల్లికార్జునరెడ్డి, నాగప్ప పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని కొక్కరచేడు గ్రామంలో వైస్ ఎంపీపీ నాగేష్, జెడ్పీటీసీ లింగప్ప ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలో రూ.17,31,59,622 మొత్తాన్ని లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈఓపీఆర్‌డీ మల్లికార్జున, నాయకులు శ్రీనివాసులు, బాలరాజు, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామంలో ఎంపీపీ నారాయణదాస్ పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకతీతంగా జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఎంపీటీసీ నాగవేణి, నాయకులు సోమశేఖర్, రవికుమార్, గుంతకంటి శ్రీను, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని గాజులదిన్నె సచివాలయంలో జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులతో కలిసి సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లలో 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు మల్లికార్జున రెడ్డి, సూరి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో సచివాలయాల మండల కన్వీనర్ వినయ్‌కుమార్ రెడ్డి, నాయకులు బజారి, బడేసాబ్, రాముడు, డైరెక్టర్ జక్కరయ్య ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో వివిధ పథకాల ద్వారా ప్రజలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. బూత్ కన్వీనర్లు శ్రీనివాస్‌రెడ్డి, చంద్ర, వెంకటరాముడు, చెన్నప్ప, మల్లికార్జున, రామాంజనేయులు, కురవ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. జెడ్పీటీసీ రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి, లుముంబా, మల్లికార్జునరెడ్డి, గిత్త పరమేష్, రామప్ప తదితరులు పాల్గొన్నారు.



గాజులదిన్నెలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



కె.తిమ్మాపురంలో సంక్షేమ పథకాల బోర్డును అవిష్కరిస్తున్న నాయకులు



కుంకనూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న కప్పట్రాళ్ల మల్లికార్జున